# సారా యుద్ధంలో గెలిచిన గ్రామం

రాజమండ్రి, 28-6-85 జూన్ 27 : అక్టోపస్ లాంటి ప్రభుత్వ సారా వ్యవస్థను ఐకమత్యంతో ఢీకొన్న కాకవాడ గిరిజనులకే అంతిమ విజయం చేకూరింది. తమ స్వగ్రామంలో సారాదుకాణం వద్దన్న ఏకసూత్రం పథకంపై ఆ సూత్రం కరిగిపోకుండా కాకవాడ గ్రామం ఏకకంఠంగా నిలబడ్డంతో సామూహిక శక్తికి తలవంచి ఎక్సైజ్ అధికారులు ఆ గ్రామం నుంచి వెళ్ళి పొమ్మని సారా కాంట్రాక్టరుకు ఆదేశాలివ్వక తప్పలేదు. కొద్ది రోజుల క్రితం ఆ గ్రామాన్ని సందర్శించిన ఎక్సైజ్ అధికారులు చాటుమాటుగా నడుస్తున్న సారాదుకాణాన్ని మూయించి, ఇక ముందు మరే వ్యక్తి ప్రయత్నాలూ చేయద్దని సారా కాంట్రాక్టరుకు చెప్పి, వారికి వీడ్కోలివ్వడంతో సారా యుద్ధం ప్రకటించిన కాకవాడ గ్రామానికి విజయం చేకూరటంతో కథ సుఖాంతమైంది. సారా అమ్మడానికి భవిష్యత్తులో కాంట్రాక్టర్లు ఎలాంటి ప్రయత్నాలు చేసినా వెంటనే తమకు తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖవారు గ్రామస్థులకు హామీ ఇచ్చారు. కొందరు విద్యావంతులైన గిరిజన గ్రామస్తులు, సాంఘిక సేవకుల ప్రేరణతో తమ గ్రామంలో సారా అమ్మడానికి వీల్లేదని గ్రామ ప్రజలు ఆందోళన జరపడం పాఠకులకు విదితమే. ఆ ఆందోళనలో భాగంగా గ్రామస్థులు గ్రామంలోని సారాదుకాణంలో సరుకు స్వాధీనం చేసుకుని కొట్టు మూయించడంతో సారా కొట్టు యజమాని కేసు పెట్టడంతో పోలీసులు ప్రముఖ సంఘ సేవకుడైన డాక్టర్ పి. శివరామకృష్ణతో సహా ఆ గ్రామంలోని నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. గిరిజనుల్లో కార్యాచరణకు అనువైన పరిస్థితులను సృష్టించే లక్ష్యంతో డాక్టరు శివరామకృష్ణ 'శక్తి' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఈ ప్రాంతంలో గిరిజనుల మధ్య కృషి చేస్తున్నారు. దీర్ఘకాలంగా ఆయన ఈ ప్రాంతంలో చేస్తున్న సాంఘిక సేవా కార్యక్రమాలు గిరిజనులను ఆకట్టుకున్నాయి. సారాకొట్టు యజమాని పెట్టిన కేసులో శివరామకృష్ణను అరెస్టు చేయడం గ్రామస్థుల ఆందోళన తీవ్రతకు దారితీసింది. సారాకొట్టు మూతబడి, గ్రామస్థుల ఆకాంక్ష నెరవేరినప్పటికీ, ఈ సందర్భంగా శివరామకృష్ణ తదితరులపై నమోదైన పోలీసు కేసు రద్దు కావడానికి ఎంత కాలం పడుతుందో వేచి చూడాల్సిందే.